సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 21 । జూలై । 2024



సీఎస్‌ఈకే జై

ఇంజినీరింగ్‌లో సీఎస్‌ఈకి డిమాండ్ పెరుగుతోంది. ఈ బ్రాంచ్‌నే ఎక్కువ మంది కోరుతున్నారు. - 8లో



సముద్ర అలలకు..

సముద్ర అలలకు ఓ మత్స్యకారుడు కొట్టుకుపోయాడు. బుడగట్లపాలెంలో ఘటన జరిగింది. - 8లో

డాక్యుమెంట్లలో మార్పులకు చాన్స్

ఆమదాలవలస: సైనిక బోర్డు డాక్యుమెంటేషన్‌లో ఎలాంటి తప్పులు నమోదైనా వాటిని సరిచేసే అవకాశం వచ్చిందని, మాజీ సైనికులు, సైనికులు వినియోగించుకోవాలని జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసర్ శైలజ అన్నారు. శనివారం పట్టణంలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పెన్షన్ పేమెంట్ అథారిటీ డాక్యుమెంటేషన్‌లో తప్పులు ఉంటే నేరుగా జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయాన్ని సంప్రదించి సవరణ చేసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

రేపటితో ఇంజినీరింగ్ ప్రవేశ గడువు ముగింపు

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ ప్రవేశాలకు సంబంధించిన ఏపీఈఏపీ సెట్–2024 కౌన్సెలింగ్‌లో భాగంగా సీట్ల కేటాయింపు పూర్తయ్యింది. సీట్లు లభించిన విద్యార్థులు సీటు లభించిన కళాశాలలకు ఈ నెల 22వ తేదీ లోపు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. లేదంటే సీటు కోల్పోతారని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, సహాయ కేంద్రం ఇన్‌చార్జి జి.దామోదర్‌రావు తెలిపారు. ఈ నెల 19నుంచి క్లాస్‌వర్క్ సైతం కళాశాలల్లో ప్రారంభించారు. మొదటి కౌన్సెలింగ్‌లో విద్యార్థులు కళాశాలలకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయక పోతే, రెండో కౌన్సెలింగ్‌లో ఈ సీట్లు ఖాళీగా చూపిస్తారు. మొదటి విడత కౌన్సెలింగ్‌లో సీటు లభించి, సెల్ఫ్ రిపోర్టు చేసిన విద్యార్థులు రెండో కౌన్సెలింగ్‌లో కళాశాల, బ్రాంచ్‌ల మార్పులు మరో సారి ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం లభిస్తుంది.

పొలాలు నీట మునిగితే ఇలా చేయండి..



నీట మునిగిన పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శ్రీధర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రెండురోజుల పాటు అల్పపీడనం వల్ల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పొలాలను కాపాడుకోవాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి కె.శ్రీధర్ సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 78,050 హెక్టార్లలో వరి ఎద, 1980 హెక్టార్లలో నాట్లు పూర్తయినట్లు జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ తెలిపారు. దీనిలో 611 హెక్టార్లలో పాక్షికంగా మునిగినట్లు క్షేత్రస్థాయి సమాచారం సేకరించినట్లు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో జూన్‌లో విత్తిన వరి పొలాలు పిలకలు దశలో, జూలైలో విత్తిన పొలాలు నారుమడి దశలో, నేరుగా విత్తిన పొలాలు మొలక దశ నుంచి మొక్క దశలో ఉన్నాయని తెలిపారు. విత్తిన 7 రోజుల నుంచి 30 రోజుల మధ్యలో నారు 5 రోజుల కన్నా ఎక్కువ మునిగితే నారుమడి దెబ్బతినే అవకాశం ఉందని, మునిగిన నారుమడిలో 5 రోజుల లోపు పూర్తిగా నీరు బయటకు తీసేసి 5సెంట్లు నారుమడికి కిలో యూరియా, కిలో పొటాష్ వేయాలని, ఒక్క గ్రాము కార్బెండిజిమ్ వేయాలని తెలిపారు. పిలకల దశలో వరి పంట మునిగితే నీరు బయటకు పోయిన తర్వాత ఎకరాకి 20కిలోల యూరియా, 20కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలని సూచించారు.

ఇళ్లలోకి వర్షపు నీరు



రోటరీ నగర్‌లో ఇళ్లలోకి చేరిన నీటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ గిరిబాల

ఎల్.ఎన్.పేట: అలికాం–బత్తిలి ప్రధాన రహదారిపై నుంచి మండల కేంద్రం రోటరీ నగర్‌లో ఉన్న ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. శనివారం ఉదయం కురిసిన వర్షం రోటరీ నగర్‌లోని వీరారపు రాజారావు, చిన్నమ్మి, కృష్ణవేణి, కామరాజు, మక్క గణపతిరావు ఇళ్లలోకి ప్రవేశించింది. దీంతో ఇంటిలో ఉన్న నిత్యావసర సరుకులతో పాటు ఇతర సామగ్రి తడిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ గిరిబాల, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వీర్వోలు రోటరీ నగర్ చేరుకుని ఇళ్లలోని నీటిని బయటకు పంపించి, నీరు ఇళ్లలోకి రాకుండా జేసీబీతో గట్టును వేయించారు. రెవెన్యూ అధికారులు బాధితుల నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు.

సీతంపేట ఐటీడీఏ పీఓగా రాహుల్‌కుమార్ రెడ్డి

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన తాటిమకుల రాహుల్‌కుమార్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన నంద్యాల జిల్లా జేసీగా పని చేస్తూ ఇక్కడకు బదిలీపై రానున్నారు. సివిల్స్‌లో 117వ ర్యాంకు సాధించిన ఆయన స్వస్థలం కడప జిల్లా పెండ్లిమర్రి మండలంలోని నందిమండల గ్రామం. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బీటెక్ పూర్తి చేసిన ఆయన ఆరో ప్రయత్నంలో సివిల్స్‌లో విజయం సాధించారు.

తిరుపతి జేసీగా శుభం బన్సల్

సీతంపేట ఐటీడీఏ పీఓగా పని చేస్తున్న శుభం బన్సల్ తిరుపతి జేసీగా బదిలీ అయ్యారు. ఎన్నికల ముందు వచ్చిన ఈయన ఎన్నికల అనంతరం వ్యక్తిగత పనుల కోసం సెలవుపై వెళ్లారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్‌గా పార్వతీపురం ఐటీడీఏ పీఓ విష్ణు చరణ్ వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో కొత్త పీఓగా రాహుల్‌కుమార్‌రెడ్డిని ఇక్కడ నియమించారు.

కళకాలం నిలిచేలా..

- కూచిపూడికి విశ్వమంతా ప్రచారం
- రెండేళ్లుగా వీధి ప్రదర్శనలు
- ఆరు యూరప్ దేశాల్లో 15 రోజుల ప్రదర్శన
- సంప్రదాయం కళాకారుల వినూత్న ప్రయత్నం

జస్టిన్ బీబర్ అనే కెనడా సింగర్ పాటలు మన వీధుల్లోనూ వినిపిస్తున్నాయి. మరి మన త్యాగరాజ కీర్తనలు అక్కడ వినిపించొద్దా..? సాల్సాలు, జాల్సాలు మన దగ్గర కూడా కనిపిస్తున్నాయి. మరి మన పవిత్రమైన కూచిపూడి పాశ్చాత్య దేశాలకు పరిచయం కాకూడదా..? సంప్రదాయం గురుకులం ఈ బృహత్కార్యాన్ని భుజాన వేసుకుంది. అనాదిగా భారతీయ సమాజం అపురూపంగా పెంచి పోషిస్తున్న కూచిపూడి నృత్యరీతుల విశేషాలను విదేశాలకు వివరిస్తోంది. అక్కడి వీధుల్లో సశాస్త్రీయంగా నృత్యం చేస్తూ అందరి దృష్టిని మన దేశం వైపు తిప్పిస్తున్నారు. విదేశీయులు కనిపెట్టిన 'ఫ్లాష్‌మాబ్' ఫార్ములాతో కూచిపూడికి ప్రచారం చేస్తున్నారు.



ఈఫిల్ టవర్ వద్ద ప్రదర్శన



జర్మనీలో స్వాతీ సోమనాథ్ ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్:

వెనిస్‌లోని నీటి గలగలల మధ్య సీతా కల్యాణం నృత్యం అదిరిపోతుంది. ఈఫిల్ టవర్ వెలుతురులో త్యాగరాజ కీర్తనకు చేసిన నాట్యమైతే అదరహో అనిపిస్తుంది. హాలెండ్‌లో తెల్లవాళ్ల మధ్య 'నగుమోము'కు పాదం కదుపుతుంటే.. ఆ దేశమంతా భారతీయ సమాజం వైపు తొంగి చూస్తుంది. ఇవేమీ ఆడిటోరియం ప్రదర్శనలు కావు. నడి వీధిన చేసిన నృత్య ప్రదర్శనలు. కేవలం కూచిపూడిని జనాల్లోకి తీసుకెళ్లడానికి చేసిన ప్రయత్నాలు. శ్రీకాకుళం నుంచి యూరప్ వరకు సంప్రదాయం గురుకులం కళాకారులు చేసిన ఈ విన్యాసం ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్.

అందరికీ కూచిపూడి గురించి చెప్పాలనే ఉద్దేశంతో సంప్రదాయం గురుకులం డైరెక్టర్ స్వాతీ సోమనాథ్ పర్యవేక్షణలో రెండేళ్లుగా వీధి ప్రదర్శనలు ఇస్తున్నారు. ఎక్కడో పెద్దపెద్ద ఆడిటోరియంలలో ప్రదర్శనలు ఇస్తే సామాన్య ప్రజలకు దాని గొప్పదనం, దానిలో ఉండే మాధుర్యం తెలియడం లేదు. అందుకే మన ప్రాంతంలోనే కాకుండా విదేశాల్లో కూడా ఈ సంప్రదాయం నృత్యకారులు అక్కడి వీధుల్లో ప్రదర్శనలు ఇచ్చి మన కూచిపూడి గొప్పతనాన్ని చాటుతున్నారు.

యూరప్ దేశాలలో..

యూరప్‌లోని ఆరు దేశాల్లో మే 11 నుంచి జూన్1 వరకు 15 రోజుల పాటు సంప్రదాయం గురుకులం డైరెక్టర్ స్వాతీ సోమనాథ్ ఆధ్వర్యంలో మరో ఇద్దరు శిష్యులతో కలసి భక్తి వేదిక్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ప్రదర్శన కోసం వెళ్లారు. దానితో పాటుగా వీధి ప్రదర్శనల్లో భాగంగా ఈఫిల్ టవర్ నుంచి వెనిస్ వరకు వీధి ప్రదర్శనలు చేశారు. ఫ్లాష్ మాబ్ తరహాలో 'అయోధ్య రామ ఇన్ యూరప్' కాన్సెప్టుతో రామాయణ శబ్దం, మరికొన్ని చిన్నచిన్న నృత్యాల ప్రదర్శనలు ఇచ్చారు. ఫ్రాన్స్‌లోని ఈఫిల్ టవర్ నుంచి ప్రారంభించి జర్మనీ, హాలెండ్, బెల్జియం, ఇటలీలోని వెనిస్, ఆస్ట్రియా నగరాల్లోని ముఖ్యమైన కూడళ్ల వద్ద కూచిపూడి సంప్రదాయ ప్రదర్శనలు ఇచ్చారు. దీనితోపాటుగా 'పిబరే రామరసం' జర్మనీలో, 'సీతాకల్యాణం' వెనిస్‌లో, 'క్షీరసాగరం' హాలెండ్‌లో, 'నగుమోము' కీర్తనను బెల్జియంలో ప్రదర్శన ఇచ్చారు. మౌంట్ ఎక్‌లిక్స్‌లోని మంచుపైన చెప్పులు లేకుండా 'తక్కువేమి మనకు' కీర్తన ప్రదర్శించారు.

గత రెండేళ్లుగా..

ముత్తుస్వామి దీక్షితుల కృతులు, త్యాగరాజ కీర్తనలు కూచిపూడి తరహాలో ప్రజల్లోకి వెళ్లడం కోసం గత రెండేళ్లుగా సంప్రదాయం విద్యార్థులు ప్రదర్శనలు ఇస్తున్నారు. ఎక్కడైనా మెయిన్ ప్రదర్శనకు వెళ్లిన చోట అక్కడి చుట్టు పక్కల ముఖ్య కూడళ్లలో ఈ ప్రదర్శనలు ఇస్తున్నారు. ఇటీవల హైదరాబాద్ మెయిన్ ప్రోగ్రాంకు వెళ్లి అక్కడ స్ట్రీట్ ప్రదర్శన ట్యాంక్ బండ్ వద్ద చేశారు. ఇలా ఇప్పటి వరకు దాదాపుగా వంద ప్రదర్శనలు ఇచ్చారు.



బెల్జియంలో సింధూజ ప్రదర్శన



స్విట్జర్లాండ్‌లో సంప్రదాయం గురుకుల విద్యార్థుల ప్రదర్శన

అందరికీ కూచిపూడి చేరాలి



సామాన్య జనాలకు కూచిపూడి చేరాలనే ఉద్దేశంతో వీధి బాగోతం తరహాలో కూచిపూడి ప్రదర్శనలు వీధుల్లో, ముఖ్య కూడళ్ల వద్ద ఇస్తున్నాం. ఇప్పటికి వంద ప్రదర్శనల వరకు ఇచ్చాం. సంప్రదాయం ప్రదర్శనలు ఎవరైనా ఏర్పాటు చేస్తే అక్కడి దగ్గర ప్రదేశాల్లో వీధి ప్రదర్శనలు ఇస్తున్నాం. యూరప్ దేశాలలో ఆ అవకాశం మాకు లభించింది.

– స్వాతీ సోమనాథ్, డైరెక్టర్, సంప్రదాయం, కల్లేపల్లి

ఎంతో ఇష్టంగా చేశా..



యూరప్ వీధి ప్రదర్శనలో పాల్గొనే అవకాశం కల్పించినందుకు మేడంకు ధన్యవాదాలు. ఎంతో ఇష్టంగా ప్రదర్శనలో పాల్గొన్నా. కూచిపూడి నృత్యాన్ని ఇతర దేశాల వీధులలో ప్రదర్శన ఇవ్వడం మన దేశ ఔన్నత్యాన్ని చాటినట్లే.

– దూసి వైష్ణవీరావు, దూసి గ్రామం

కూచిపూడి సేవలో తరిస్తున్నా..



మేము సంప్రదాయ గురుకులం డైరెక్టర్ మేడం వద్ద కూచిపూడి నేర్చుకున్నాం. వారి ఆశయాలకు అనుగుణంగా మేము ప్రదర్శనల్లో పాలు పంచుకుంటున్నాం. యూరప్ దేశాల్లో మన సంప్రదాయ ప్రదర్శనలు ఇవ్వడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది.

– సింధూజ, నందివాడ, దూసి గ్రామం

23 నుంచి 27 వరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బాల ఆధార్ 5 ఏళ్ల లోపు, 5 నుంచి 7 ఏళ్ల లోపు, 15 నుంచి 17 ఏళ్ల వారు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలని అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆధార్ అప్‌డేషన్ ప్రత్యేక కార్యక్రమం ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 10 సంవత్సరాల్లో పేరు, చిరునామా, పుట్టిన తేదీల్లో ఎలాంటి మార్పులు చేయని వారు వారి ఒరిజినల్ గుర్తింపు ధ్రువీకరణ పత్రంతో ఆధార్ క్యాంపులలో అప్‌డేట్ చేసుకోవాలని కోరారు. ఆధార్ అప్‌డేషన్‌కు కార్పొరేషన్ పరిధిలో గల సచివాలయాలు, పాఠశాలలు, కళాశాల, అంగన్‌వాడీ సెంటర్లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నామని, తప్పనిసరిగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పొందూరు ఖాదీపై వీడియో పోటీలు

- వీడియోల సమర్పణకు గడువు తేదీ ఆగస్టు 1



పొందూరు: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆగస్టు 7న పొందూరు ఖాదీపై వీడియో పోటీలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ కె.శ్రీకాంత్ ప్రభాకర్ శుక్రవారం విడుదల చేసిన ఓ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ప్రజల్లో చైతన్యం రగిలించడమే కాక స్వదేశీ వస్తు ఉద్యమంలో కూడా చేనేత వస్త్ర ఉత్పత్తి కీలక పాత్ర పోషించిందన్నారు. భారతీయ చరిత్రలో చేనేత ప్రాధాన్యతకు గుర్తింపుగా 2015 నుంచి ప్రతి ఏటా ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పొందూరు ఖాదీ తయారీపై వీడియో పోటీలు నిర్వహిస్తోందన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచినవారు పొందూరు ఖాదీ వస్త్ర తయారీలోని అన్ని దశలను పొందుపరుస్తూ చక్కటి వీడియోను రూపొందించాలని వివరించారు. ఉత్తమ వీడియోకు నగదు పారితోషికం, ప్రశంసాపత్రం అందించి ఘనంగా సత్కరిస్తామన్నారు. ఉత్సాహవంతులైన వారు ఇతర వివరాలకు పి.శ్రీనివాసరెడ్డి, సహాయ సంచాలకులు ఫోన్ నంబర్ 9492344466 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. అలాగే కార్యాలయం, చేనేత, జౌళీశాఖ, 4వ అంతస్తు, ఐహెచ్‌సీ కార్పొరేట్ బిల్డింగ్ మంగళగిరి, గుంటూరుజిల్లా వారిని 2024 జూలై 26వ తేదీలోగా సంప్రదించి తమ వీడియోలను ఆగస్టు 1వ తేదీలోగా సమర్పించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జిల్లా కొత్త జేసీగా ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

- అన్నమయ్య జిల్లా జేసీగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ
- ప్రస్తుత జేసీ నవీన్‌కు సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్‌గా బదిలీ
- టెక్కలి సబ్ కలెక్టర్‌కు సైతం బదిలీ
- ఆర్థిక శాఖ డిప్యూటీ కార్యదర్శిగా నియామకం
- కలెక్టర్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన మనజీర్ జిలానీ సమూన్‌కు మార్క్‌ఫెడ్ ఎండీగా పోస్టింగ్



ఫర్మాన్ అహ్మద్ ఖాన్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : జిల్లా కొత్త జాయింట్ కలెక్టర్‌గా ఫర్మాన్ అహ్మద్ ఖాన్ నియమితులయ్యారు. అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. మన జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన మల్లారపు నవీన్‌కు సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్‌గా బదిలీ అయింది. ఆయనతో పాటు పాటు టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌కు కూడా బదిలీ జరిగింది. ఆర్థిక శాఖ డిప్యూటీ కార్యదర్శిగా నియమితులయ్యారు. వీరి బదిలీలతో జిల్లాలో ఎన్నికల ముందు నుంచి పనిచేస్తున్న ఉన్నతాధికారులంతా వెళ్లిపోయినట్టైంది. ఐఏఎస్, ఐపీఎస్ హోదా గల అధికారులంతా బదిలీ అయిపోయినట్టే. పాత ముఖాలు పోయి కొత్త ముఖాలు వస్తున్నాయి.

ఐఏఎస్, ఐపీఎస్‌లందరికీ బదిలీలు

ఎన్నికలకు కొన్ని నెలల ముందు నంద్యాల జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తూ ఇక్కడికి కలెక్టర్‌గా వచ్చిన మనజీర్ జిలానీ సమూన్‌కు ఇటీవల బదిలీ అయిపోయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో కలెక్టర్‌గా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించి జిల్లాలో యాక్టివ్ అయ్యారు. అయితే బదిలీ అయిన మనజీర్ జిలానీ సమూన్‌కు ఆ సమయంలో ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడంతో తాజాగా ఏపీ మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదే విధంగా ఎన్నికలకు కొన్ని నెలలు ముందు శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన తమీమ్ అన్సారియాకు కూడా రాష్ట్ర వ్యాప్తంగా చేసిన రెండో విడత బదిలీల్లో భాగంగా ప్రకాశం కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఇక జిల్లా ఎస్పీగా పనిచేసిన జీఆర్ రాధికకు ఇటీవల బదిలీ అయింది. ఆమె స్థానంలో రంపచోడవరం ఓఎస్డీగా పనిచేసిన కేవీ మహేశ్వరరెడ్డి ఎస్పీగా నియమితులయ్యారు. ఆయన కూడా బాధ్యతలు స్వీకరించి విధుల్లో నిమగ్నమయ్యారు.

తాజాగా జేసీ, సబ్ కలెక్టర్‌కు బదిలీ

2022 అక్టోబర్ నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న మల్లారపు నవీన్‌కు సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ఫర్మాన్ అహ్మద్ ఖాన్ బదిలీపై వస్తున్నారు. టెక్కలి సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న నూరుల్ ఖమర్‌కు కూడా బదిలీ అయింది. ఆర్థిక శాఖ డిప్యూటీ కార్యదర్శిగా నియమితులయ్యారు. వీరి స్థానంలో ఇంకా ఎవర్ని నియమించలేదు. దీంతో జిల్లాలో ఎన్నికల ముందు వరకు పనిచేసిన ఐఏఎస్, ఐపీఎస్‌లందర్నీ బదిలీ చేసినట్టు అయింది. ఇంకా ఎవరూ మిగల్లేదు. దీంతో కొత్త అధికారులతో కొత్త ప్రభుత్వ పాలన సాగుతున్నట్టుగా చెప్పుకోవాలి.

నీలి నింగిలో..



మూడు రోజులుగా ఆకాశాన్ని కమ్మేసి ఉన్న మబ్బులు శనివారం కాస్త తొలిగి వెలుగునిచ్చాయి. జిల్లా కేంద్రాన్ని ఆవరించి ఉన్న నల్లటి మేఘాలు చెదిరిపోవడంతో నిర్మలమైన ఆకాశం కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



క్లుప్తంగా

కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన

శ్రీకాకుళం పాతబస్టాండ్: పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కొత్త క్రిమినల్ చట్టాలపై మరింతగా అవగాహన పెంచుకోవాలని జిల్లా డిప్యూటీ డైరెక్టర్స్ ఆఫ్ ప్రాసిక్యూషన్, ఎస్సీ ఎస్టీ కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెట్ట మల్లేశ్వరరావు అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న ప్రాసిక్యూషన్ ఆఫీసులో శనివారం సమావేశం నిర్వహించారు. జూలై ఒకటి నుంచి ఈ కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయని, వాటిని చదివి వాటికి అనుగుణంగా కేసులు విచారించాలని సూచించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: స్థానిక తెంబూర్ రోడ్డులో గల రైల్వే ట్రాక్‌పై శనివారం సాయంత్రం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. స్థానికులు కాపాడడంతో బతికిపోయాడు. సాయంత్రం 5గంటల సమయంలో గుణుపూర్ నుంచి విశాఖపట్నం వెళ్లే పాసింజర్ వచ్చే సమయానికి ఓ వ్యక్తి ఒక్కసారిగా రైలు పట్టాలపైన పడుకున్నాడు. స్థానికులు గుర్తించి ఆ వ్యక్తిని పట్టాల పైనుంచి బయటకు లాగేయడంతో పెనుప్రమాదం తప్పింది. అయితే ఆ వ్యక్తిని స్థానికులు ప్రశ్నించగా తాను చచ్చిపోతానని తనది గొల్లవీధి అని చెప్పాడు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చే సమయానికి ఆ వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

నీట మునిగిన చినకొవ్వాడ పాఠశాల



చినకొవ్వాడలో నీట మునిగిన ప్రభుత్వ పాఠశాల

రణస్థలం: మండలంలోని కొవ్వాడ పంచాయతీలో గల చిన కొవ్వాడలో గల మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో వర్షపు నీరు ప్రవేశించి పాఠశాల పూర్తిగా మునిగిపోయింది. పాఠశాల ప్రహరీ విరిగిపోవడం వల్ల ఎగువ నుంచి వస్తున్న వర్షపు నీరు పాఠశాలలోకి చేరుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ నీరు మరో మూడు రోజుల పాటు అలాగే ఉంటుందని, ప్రహరీ నిర్మించాలని వారు కోరుతున్నారు.

కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి



పున్నానపాలెంలో చనిపోయిన గొర్రెలు పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

రణస్థలం: మండలంలోని సంచాం పంచాయతీలో గల పున్నానపాలెం గ్రామానికి చెందిన ఇప్పిలి రమణకు చెందిన 13 గొర్రెలు, రెండు మేకలు వీధి కుక్కల దాడిలో చనిపోయాయి. బాధితుడు రమణ తెలిపిన వివరాలు ప్రకారం .. సంచాం కొండ వద్ద శుక్రవారం రాత్రి గొర్రెల మందను పెట్టారు. సుమారు 12 వీధి కుక్కలు అర్ధరాత్రి రెండు గంటల సమయంలో గొర్రెల మందపై దాడి చేసి చంపేశాయని బాధితుడు వాపోయాడు. రణస్థలం పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.దుర్గారావు సంఘటన స్థలాన్ని పరిశీలించి చనిపోయిన గొర్రెలు, మేకలకు శవ పంచనామా చేయించారు. గాయపడిన వాటికి చికిత్స అందజేశారు. బాధితుడికి సుమారు రెండు లక్షలు నష్టం వాటిల్లిందని, గొర్రెలకు బీమా చేయలేదని తెలిపారు. బాధితుడు రమణ మాట్లాడుతూ 13 గొర్రెలు, రెండు మేకలు చనిపోగా, మరో ఐదు గాయపడ్డాయని వీటికి జరిగిన నష్టాన్ని గుర్తించి ప్రభుత్వమే ఆదుకోవాలని రోదిస్తున్నాడు.

ఆదిత్య విద్యార్థికి ఇండియా బుక్‌లో స్థానం



విద్యార్థిని వర్షప్రియను అభినందిస్తున్న ఆదిత్య కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు, అధ్యాపక సిబ్బంది

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఈసీఈ తృతీయ సంవత్సరం విద్యార్థి బోటు వర్షప్రియ ప్రతిష్టాత్మకమైన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం సాధించింది. ఈ మేరకు శనివారం కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావుతో పాటు అధ్యాపకులు విద్యార్థిని వర్షప్రియను అభినందించారు. హరియాణాలోని ఫరీదాబాద్ కేంద్రంగా 2006లో స్థాపించిన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో విద్యార్థి స్థానం సంపాదించినట్లు పేర్కొన్నారు. విద్యార్థి వర్షప్రియ 17.15 నిమిషాల్లో పెన్సిల్ ముల్లుపై ఏ నుంచి జెడ్ వరకు గల 26 అంకెలను బ్లేడ్ సహాయంతో చెక్కడం వల్ల ఇండియా బుక్ స్థానం చోటు సంపాదించినట్లు పేర్కొన్నారు. వర్షప్రియ మాట్లాడుతూ.. తనకు చిన్నతనం నుంచి సరదాగా సుద్దముక్కలు, పెన్సిళ్లపై బొమ్మలు వేయడం అలవాటుగా మారిందన్నారు. తన తల్లి ప్రోత్సాహంతో ఈ కళను అభ్యసించానని విద్యార్థి తెలిపారు.

సీఎస్ఈకే జై

- ఇంజినీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్‌కే తొలి ప్రాధాన్యత
- ఆ తర్వాత ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌కు డిమాండ్



ఇంజినీరింగ్ విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లా ఇంజినీరింగ్ విద్యార్థులు కంప్యూటర్ సైన్స్ వైపే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో నాలుగు ఇంజినీరింగ్ కాలేజ్‌లు, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కోర్సులు నిర్వహిస్తున్నారు. తొమ్మిది ఇంజినీరింగ్ బ్రాంచ్‌లు ఉన్నాయి. గత కొన్నేళ్లుగా కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌కు డిమాండ్ ఉంది. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి కనిపించింది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ తర్వాత ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌కు విద్యార్థులు ప్రాధాన్యత ఇచ్చారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దృష్టిలో పెట్టుకొని ఈ బ్రాంచ్‌లకు విద్యార్థులు ప్రాధాన్యత ఇచ్చారు.

జిల్లాలో నాలుగు ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఐతం, శివానీ, వెంకటేశ్వర, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయాల్లో కన్వీనర్ కోటాలో 2154 సీట్లు ఉండగా, 1847 ప్రవేశాలు జరిగాయి. ప్రైవేట్ కళాశాలల్లో 70 శాతం కన్వీనర్ కోటా, బీ కేటగిరీలో మేనేజ్‌మెంట్ కింద 30 శాతం ప్రవేశాలు కల్పిస్తారు. మొదటి విడత ఏపీ ఈఏపీ సెట్ -2024 కౌన్సెలింగ్ పూర్తయ్యి ఈ నెల 19 నుంచి క్లాస్‌వర్క్ సైతం ప్రారంభమైంది. త్వరలో తుదివిడత, మేనేజ్‌మెంట్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఇంజినీరింగ్ కాలేజ్‌లు సైతం సీఎస్ఈ, ఈసీఈ బ్రాంచ్‌లు పెంచుకున్నాయి. సివిల్, మెకానికల్, ట్రిపుల్‌ఈ బ్రాంచ్‌ల్లో సీట్లు తగ్గించుకున్నాయి. అయితే పాలిటెక్నిక్ డిప్లమా అనంతరం ఈసెట్ ద్వారా రెండో ఏడాది ఇంజినీరింగ్ లేట్రల్ ఎంట్రీ ప్రవేశాలు ఈ బ్రాంచ్‌ల్లో నిర్వహిస్తారు. దీంతో ఈ బ్రాంచ్‌లను కళాశాలలు నిర్వహిస్తున్నారు. మరో పక్క కొత్త బ్రాంచ్‌లు సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మిషన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డేటా సైన్స్ వంటి కోర్సులు కొన్ని కళాశాలలు ప్రారంభించినా, తక్కువ సీట్లతో ఈ కోర్సుల ప్రారంభించారు. ఈ కోర్సులు సైతం సాఫ్ట్‌వేర్ ఆధారిత కోర్సులు.

ట్రిపుల్ ఐటీలోనూ..

ప్రతిష్టాత్మక విద్యా సంస్థ రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో సైతం విద్యార్థులు సీఎస్ఈ, ఈసీఈలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎక్కువ సెక్షన్లు సైతం ఈ బ్రాంచ్‌ల్లోనే నిర్వహిస్తున్నారు. 1053 సీట్లకు ఈ విద్యాసంవత్సరంలో 917 మంది ప్రస్తుతం ప్రవేశాలు పొందగా, సీఎస్ఈలో 353, ఈసీఈలో 344 మంది విద్యార్థులు చేరారు.

ఉపాధి అవకాశాలు దృష్టిలో పెట్టుకుని..



ఎక్కువ మంది విద్యార్థులు సీఎస్ఈ, ఈసీఈ గ్రూపులు ఎంచుకుంటున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయి. భవిష్యత్‌లో మార్కెట్‌లో మార్పులు రావచ్చు. ప్రస్తుతం మిషన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటరింగ్ వంటి వాటి వల్ల సాఫ్ట్‌వేర్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. సివిల్, మెకానికల్, ట్రిపుల్‌ఈ వంటి బ్రాంచ్‌ల్లో ప్రభుత్వ ఉద్యోగాలకు సైతం మంచి అవకాశాలు ఉంటాయి.

– కంది విద్యాసాగర్, ప్లేస్‌మెంట్ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

సాఫ్ట్‌వేర్ ట్రెండ్ కొనసాగుతోంది..



ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ట్రెండ్ కొనసాగుతోంది. భవిష్యత్‌లో మార్పులు రావచ్చు. ప్రధానంగా విద్యార్థుల నైపుణ్యాలపైనే ఉపాధి, ఉద్యోగాలు ఆధారపడి ఉంటాయి. సీఎస్ఈ విద్యార్థి కంటే సివిల్, మెకానికల్ విద్యార్థులు ఎక్కువ వేతనాలకు ఎంపిక కావచ్చు.

– డాక్టర్ చింతాడ రాజశేఖర్‌రావు, ప్రిన్సిపాల్, బీఆర్ఏయూ ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాల

జిల్లా నాలుగు కళాశాలల్లో...		
బ్రాంచ్	సీట్లు	చేరిన విద్యార్థులు
సీఎస్ఈ	546	529
ఈసీఈ	402	386
సివిల్	258	145
ట్రిపుల్‌ఈ	234	196
మెకానికల్	258	162
సీఎస్‌డీ	96	94
సీఎస్ఎం	120	115
ఐఎస్ఎఫ్	144	142
ఏఐఎంఎల్	96	78
ఆర్‌జీయూకేటీలో...		
బ్రాంచ్	సీట్లు	ప్రవేశాలు
సీఎస్ఈ	354	353
ఈసీఈ	350	344
ట్రిపుల్‌ఈ	116	86
మెకానికల్	116	39
సివిల్	117	95

శాకంబరీ దేవి..



అవలింగిలోని నీలమణి అమ్మవారిని శనివారం కూరగాయలతో శాకంబరీ దేవిగా అలంకరించారు. ఆదివారం పౌర్ణమిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు.

- సారవకోట

జిల్లా హెల్త్ టాస్క్‌ఫోర్స్ టీమ్ తనిఖీలు



పెద్దకోట సచివాలయంలో తనిఖీలు చేపడుతున్న జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంలోని ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ నోడల్ అధికారి డాక్టర్ జీవీ లక్ష్మి, గణాంకాధికారి వీఆర్ నాగేశ్వరరావు శనివారం తనిఖీలు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న పెద్దకోట-1 సచివాలయానికి సంబంధించి గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికల రక్తనమూనాలను తీయించి వారి ఆరోగ్య వివరాలను పరిశీలించారు. మాతా శిశువివరాలు, ఆరోగ్య ఆసరా, జననీ సురక్ష యోజన, ప్రధాన మంత్రి మాతృవందనా యోజన పథకం కింద తొలిసారి గర్భిణులకు తమ బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుందా లేదా అనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం పీహెచ్‌సీలో ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. జిల్లా ప్రోగ్రాం నర్సింగ్ అధికారి వి.శైలజ, జిల్లా ప్రోగ్రాం అధికారి పి.మురళీ, వైద్యురాలు వి.నీతూ, సునీత, లక్ష్మీదీప్, పర్యవేక్షణ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నా కుమార్తెను బలి తీసుకున్నారు..

- గార ఎస్‌బీఐ బంగారం కేసులో మా కుటుంబాన్ని ఇరికించారు
- బ్యాంకు ఉద్యోగి స్వప్న ప్రియ తల్లి సరళ
- జాతీయ మహిళా, మానవహక్కుల కమిషన్లకు ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్: గార ఎస్‌బీఐలోని బంగారం మాయం కేసులో తమ కుటుంబాన్ని అన్యాయంగా ఇరికించారని, తన కుమార్తె ఉరిటి స్వప్నప్రియను బలి తీసుకున్నారని ఆమె తల్లి ఉరిటి సరళ ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి జిల్లా ఎస్బీఐ రీజనల్ మేనేజర్ తోటకూర రమణమూర్తి రాజుపై జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్లకు ఈనెల 13న ఫిర్యాదు చేశారు. తన కుమార్తెకు విడాకులయ్యాయని, తన వద్దే నివసించేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. 2022 నుంచి తన కుమార్తె గార బ్రాంచిలో పనిచేయడం, 2023 నవంబరు 20న లీవ్ పెట్టడం, ఆ ముందు రోజే వేరే వ్యక్తికి స్వప్నప్రియ డ్యూటీ ఛార్జి ఇవ్వడం జరిగిందని, అదే నవంబరు 24న తనఖా బంగారం మాయమైనట్లు బ్యాంకు అసోసియేషన్ ద్వారా తన కుమార్తెకు తెలియడం, బయటకు కూడా వెలుగులోకి రావడం జరిగిందన్నారు. పత్రికల్లో, సోషల్ మీడియాలో పథకం ప్రకారం కొంతమంది బ్యాంకు ఉద్యోగులే స్వప్నప్రియ నేరం చేసినట్లు రాయించారని ఆరోపించారు. 2023 నవంబరు 28న ఆర్ఎం రాజు కొన్ని పత్రికల్లో గార బ్యాంకులో బంగారం పోలేదంటూ స్టేట్‌మెంట్లు ఇచ్చారని, అదే రోజు స్వప్నప్రియతో పాటు జాయింట్ కస్టోడియన్‌గా ఉన్న క్యాషియర్ తనపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసినట్లు చెప్పాడని, స్వప్నప్రియే నగలు కాజేసిందని, ఆ విషయం బయటకు ఎక్కడ పొక్కుతుందోనని తనపై దాడి చేయించినట్లు రూరల్ పీఎస్‌లో తప్పుడు కేసు పెట్టాడన్నారు. అది భరించలేని తన కుమార్తె అన్ని నేరాల్లో తననే బాధ్యురాలిగా చేయడం, పత్రికల్లో వచ్చిన కథనాలు, కుటుంబం తన వల్ల అప్పులు చేయడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. ఈ విషయంలో అప్పటి ఆర్ఎం రాజుపై చర్యలు తీసు కోవాలని కోరారు. ఈ విషయంపై దర్యాప్తు అధికారిగా ఉన్న డీఎస్పీ యర్రగుంట శృతి వద్ద శనివారం సాయంత్రం ప్రస్తావించగా కేసు ఛార్జిషీటు నమోదు కాలేదని, దర్యాప్తులోనే ఉందని అన్నారు. స్వప్నప్రియ ఆత్మహత్య, ఆమె తల్లి ఆరోపణలపై శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ వాసుదేవరావు వద్ద ఇదే విషయం ప్రస్తావించగా కేసు పెండింగ్‌లో ఉందని ఆయన అన్నారు.

బిల్లుల చెల్లింపునకు బారులు



ఈఆర్వో కార్యాలయం వద్ద బారులు తీరిన వినియోగదారులు

అరసవల్లి: విద్యుత్ వినియోగదారులకు కొత్త యాప్ కష్టాలు మొదలయ్యాయి. ఇంతవరకు నేరుగా ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం తదితర యూపీఐ పేమెంట్ల రూపంలో విద్యుత్ వినియోగ చార్జీలను చెల్లించేవారు. ఇప్పుడు పూర్తిగా ఏపీఈపీడీసీఎల్ యాప్ ద్వారానే బిల్లులు చెల్లించాలంటూ కొత్త ఆంక్షలు విధించడంతో వినియోగదారులు అవగాహన లోపంతో ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఇంకా విస్తృతంగా ప్రచారం లేకపోవడంతో.. కొందరు వినియోగదారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ వినియోగదారులు తమ ఫోన్లలో ప్లేస్టోర్ నుంచి లేదా ఏపీఈస్ట్రన్‌పవర్.కాం వెబ్‌సైట్ నుంచి గానీ సంస్థ అధికారిక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇకమీదట ఆన్‌లైన్ పేమెంట్లు అన్నీ ఇలాగే చెల్లించాల్సి ఉంటుంది. అయితే కొత్త యాప్ అమలు తెలియక చాలా మంది ఈఆర్వో కార్యాలయం వద్ద వినియోగదారులు బారులు తీరారు. అక్కడైనా విద్యుత్ సిబ్బంది యాప్‌పై అవగాహన కల్పించేలా ప్రత్యేక డెస్క్‌ను ఏర్పాటు చేస్తే బాగుండుననే అభిప్రాయాలు వ్యక్తమయ్యా యి. ఒక్కరోజు గడువు తీరితే ఫైన్‌లు పడతాయనే ఆందోళనతో యాప్ కష్టాలు పడుతూనే ఈఆర్వో కార్యాలయానికి వినియోగదారులు క్యూ కట్టారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మాదక ద్రవ్యాల వాడకంపై నిఘా



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మాదక ద్రవ్యాలను నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, వీటి వినియోగంపై నిఘా ఉంచాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. పిల్లల్లో డ్రగ్స్ వాడకాన్ని నియంత్రించేందుకు జిల్లా స్థాయిలో సంయుక్త కార్యాచరణ రూపొందించేందుకు జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాంలతో కలిసి ఆయన చర్చ నిర్వహించారు. శ్రీకాకుళం నుంచి ఒక రిపోర్టు తయారు చేస్తే ఆ రిపోర్టును రాష్ట్రంలో అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు మాట్లాడుతూ డ్రగ్స్ వాడకంతో కుటుంబ విలువలకు భంగం వాటిల్లుతుందన్నారు. వసతి గృహాల్లో ఆల్కహాల్, మాదక ద్రవ్యాలను నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషన్ సభ్యులు గొండు సీతారాం సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో ఒక సమావేశం ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. డ్రగ్స్ నిరోధంపై హోర్డింగులు ఏర్పాటు చేయాలని, సినిమా థియేటర్లలో యాడ్‌లు వేయాలని సభ్యులు కోరగా పౌర సంబంధాల శాఖ అధికారి కె.చెన్నకేశవరావు మాట్లాడుతూ సినిమా థియేటర్లలో స్లైడ్స్ వేసేందుకు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి థియేటర్లకు ఆదేశాలు ఉండాలని చెప్పారు. మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో మాదక ద్రవ్యాల నిరోధంపై బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. రైల్వే స్టేషన్ ప్రాంతంలో అవగాహన కల్పిస్తున్నట్లు రైల్వే ఎస్ఐ చెప్పారు. ఆర్టీసీలో మాదక ద్రవ్యాల రవాణాపై సంబంధిత డ్రైవర్లు కండక్టర్లకు, పార్శిల్ సర్వీసులకు సంబంధించి సిబ్బందికి ఇప్పటికే సూచించినట్లు ఆర్ఎం వివరించారు.

సముద్ర అలలకు కొట్టుకుపోయి..



బి.లక్ష్మణ (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లడం లేదు. అయితే బుడగుట్లపాలేంకు చెందిన సూరాడ లక్ష్మణ (40) అనే మత్స్యకారుడు శనివారం వాతావరణం అంతా బాగానే ఉందనే ఉద్దేశంతో ఉదయం గేలంతో చేపలు వేటాడేందుకు సముద్రానికి వెళ్లాడు. తీరంలో లోపలకు వెళ్లి సముద్రంలో గేలం వేశారు. కానీ ఉద్ధృతంగా వచ్చిన సముద్ర అలలకు కొట్టుకుపోయాడు. అక్కడ ఉన్న వారు గమనించి కుటుంబ సభ్యులకు, బంధువులకు సమాచారం ఇచ్చారు. దీంతో మత్స్యకారులు బోట్లతో గాలించారు. ఉద యం ఎనిమిది గంటల సమయంలో మృతదేహం ఒడ్డుకు చేరుకుంది. మృతుని భార్య పోలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మృతునికి భార్యతో పాటు కుమార్తె కామేశ్వరి ఉంది. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



లక్ష్మణ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు


గుర్రపు డెక్కను తొలగించాలి



గొట్టా బ్యారేజీ వద్ద గుర్రపు డెక్కను పరిశీలిస్తున్న రైతుసంఘ కార్యదర్శి అప్పలనాయుడు

హిరమండలం: గొట్టా బ్యారేజీలో గుర్రపు డెక్కను తొలగించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి బడిశి అప్పలనాయుడు కోరారు. శనివారం వంశధార గొట్టాబ్యారేజీలో ఉన్న గుర్రపు డెక్కను ఆయన పరిశీలించారు. వరదలకు కొట్టుకొచ్చిన గుర్రపు డెక్క కాలువల్లోకి నీరు వెళ్లకుండా అడ్డుకుంటోందని, తొలగించాలని కోరారు.

వానందం



మడ్డువలస జలాశయం

గొట్టా బ్యారేజీ	
ఆయకట్టు	3.25 లక్షల ఎకరాలు
నిల్వ సామర్థ్యం	0.6619 టీఎంసీ
నీటి మట్టం	38.10 మీటర్లు
ప్రస్తుత నీటి మట్టం	38.10 మీటర్లు
ఇన్‌ఫ్లో	5068 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	5000 క్యూసెక్కులు
మడ్డువలస	
ఆయకట్టు	37000 ఎకరాలు(ఫేజ్-1,2)
నిల్వ సామర్థ్యం	3.05 టీఎంసీ
ఇన్‌ఫ్లో	1313 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	1313 క్యూసెక్కులు
తోటపల్లి రిజర్వాయర్	
ఆయకట్టు	50వేల ఎకరాలు(జిల్లాలో)
నిల్వ సామర్థ్యం	2.04 టీఎంసీలు
ఇన్‌ఫ్లో	1880 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	1800 క్యూసెక్కులు

మండలం	వర్షపాతం (మిల్లీమీటర్లలో)	మండలం	వర్షపాతం	మండలం	వర్షపాతం
		నందిగాం	60.4	పోలాకి	48.4
		ఎచ్చెర్ల	59.2	లావేరు	46.4
సరుబుజ్జిలి	91.0	పలాస	59.0	రణస్థలం	45.8
ఎల్ఎన్‌పేట	78.6	కొత్తూరు	58.4	కవిటి	43.2
శ్రీకాకుళం	76.4	గార	57.8	వజ్రపుకొత్తూరు	40.2
హిరమండలం	75.4	జి.సిగడాం	55.6	ఇచ్ఛాపురం	39.8
టెక్కలి	67.6	సంతబొమ్మాళి	54.0	సారవకోట	35.2
ఆమదాలవలస	63.0	పాతపట్నం	53.8	మెళియాపుట్టి	32.6
కోటబొమ్మాళి	62.0	నరసన్నపేట	53.8	కంచిలి	32.0
జలుమూరు	61.6	పొందూరు	52.2	సోంపేట	24.2
బూర్జ	60.6	మందస	50.2		

శ్రీకాకుళం పాతబస్టాండ్:

జిల్లాలో మూడో రోజూ జల్లులు కురిశాయి. మొత్తం ముప్పై మండలాల్లో 1638.4 మిల్లీమీటర్ల వాన కురిసింది. శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లోనే ఎక్కువగా వాన కురిసింది. దీంతో వంశధా ర, నాగావళిలో నీటి మట్టాలు పెరిగాయి.

కొత్త నీరు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా వానలు కురవడంతో ప్రధాన నీటి వనరుల్లో కొత్త నీరు వచ్చి చేరింది. నిన్న మొన్నటి వరకు ఇసుక దిబ్బలతో కనిపించిన నదులు, ప్రాజెక్టుల్లో కొంత మేర నీరు చేరింది. పూర్తిగా ఎండిన వెదపాలాలు, నారుమళ్లకు కూడా ఈ వాన ఊపిరి పోసింది.